క్లుప్తంగా

కలెక్టర్‌కు నివేదిక



నర్సంపేట : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన రోబోటిక్స్ సైన్స్ వర్క్‌షాపుపై ప్రిన్సిపాల్ మల్లం నవీన్ ఆధ్వర్యంలోని బృందం జిల్లా కలెక్టర్ సత్యశారదను గురువారం కలిసి నివేదిక అందజేసింది. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడారు. భవిష్యత్తులో విద్యార్థులకు మరిన్ని అవకాశాలు కల్పించేలా సహకరించాలని కోరారు. కళాశాలలో నూరు శాతం అడ్మిషన్లు జరిగాయని, అత్యధికులు పేద విద్యార్థులేనని చెప్పారు. తరగతి గదుల నిర్మాణం, కంప్యూటర్లతో కూడిన ల్యాబ్ ఏర్పాటు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు, క్రీడా పరికరాలు అందించాలన్నారు. కార్యక్రమంలో రోబోటిక్ వర్క్‌షాప్ ఆర్గనైజింగ్ కమిటీ ఇన్‌చార్జ్ డాక్టర్ సత్యనారాయణ, అధ్యాపకులు డాక్టర్ కందాల సత్యనారాయణ, రుద్రాణి, డాక్టర్ పూర్ణచందర్ పాల్గొన్నారు.

డెస్క్ బెంచీల అందజేత

గీసుకొండ : మండలంలోని ధర్మారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు విద్యార్థుల కోసం హన్మకొండ ఐడీబీఐ బ్యాంకు డిప్యూటీ జనరల్ మేనేజర్ సుష్మా రామరాజు గురువారం 25 డెస్క్ బెంచీలు అందజేశారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకు రిలేషన్‌షిప్ మేనేజర్ కంప పవన్, వరుణ్, హెచ్‌ఎం సురేఖ, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ-2025లో విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట : నవోదయ-2025 ప్రవేశ పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని భవిత కోచింగ్ సెంటర్‌కు చెందిన 20 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి సీటు సాధించారని ఆ కోచింగ్ సెంటర్ చైర్మన్ షేర్ల సంతోశ్ సంజన తెలిపారు. సీట్లు సాధించిన విద్యార్థులను గురువారం ఆమె అభినందించి మెమొంటోలు బహూకరించారు. అనంతరం సంతోశ్ మాట్లాడారు. బాధ్యతాయుతమైన, క్రమశిక్షణతో కూడిన విద్యను అందించడం వల్లే ఫలితాలు వచ్చాయన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థుల కోసం హన్మకొండ పట్టణంలోని భీమారంలో కోచింగ్ సెంటర్ ప్రారంభించామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసన్న, సమత, దాసరి రాజు, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

'ధర్మస్థలి కేసులో రక్షణ కొనసాగించాలి'

నర్సంపేట : కర్ణాటక ప్రభుత్వం ధర్మస్థలి కేసులో శాస్త్రీయ, నిష్పాక్షిక, వేగవంతమైన దర్యాప్తు చేపట్టి ఆధారాల, సాక్షుల, న్యాయవాదులకు రక్షణ కొనసాగించాలని పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పూలక్క కోరారు. పట్టణంలోని న్యూడెమోక్రసీ కార్యాలయంలో జక్కుల విజయ అధ్యక్షతన గురువారం నిర్వహించిన సదస్సుకు ఆమె హాజరై మాట్లాడారు. కర్ణాటకలోని ధర్మస్థల ఆలయం, చుట్టుపక్కల వందలాది బాలికలు, మహిళల సామూహిక హత్యలు, సామూహిక ఖననంపై ఎఫ్ఐఆర్‌పై అక్కడి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు ఇప్పటికీ కొనసాగుతోందన్నారు. ధర్మస్థలానికి సంబంధించిన ఆరోపణలపై నిష్పాక్షికంగా, పూర్తిస్థాయిలో వేగంగా, శాస్త్రీయంగా, దర్యాప్తు చేయించాలని కోరారు. మహిళా, ప్రజాస్వామ్య సంఘాలు గళమెత్తాలని ఆకాంక్షించారు. అనంతరం పీవోడబ్ల్యూ డివిజన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా జక్కుల విజయ, ఆకుల శైలజ, సభ్యులుగా సంధ్య, వీరలక్ష్మి, సుక్కమ్మ ఎన్నికయ్యారు.

గీత కార్మికుడికి గాయాలు

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లికి చెందిన గీత కార్మికుడు గాజుల ఉమేశ్ గురువారం కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి తాటిచెట్టుపై నుంచి తీవ్ర గాయాల పాలయ్యాడు. ఆయన్ను తోటి గీత కార్మికులు, కుటుంబీకులు 108 అంబులెన్స్‌లో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఉమేశ్‌కు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని గీత కార్మికులు కోరారు.

విద్యుత్ స్తంభానికి కారు ఢీ

వర్ధన్నపేట : వర్ధన్నపేట వైపు నుంచి వరంగల్ దిశగా ప్రయాణిస్తున్న కారు మండలంలోని కట్ర్యాలలో జాతీయ రహదారిపై అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. అనంతరం ఆటోను ఢీకొంది. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. విద్యుత్ స్తంభం మూడు ముక్కలు కాగా వ్యక్తులకు ప్రమాదం వాటిల్లకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

నర్సంపేట : నేడు (శుక్రవారం) నెక్కొండ మండలంలోని అలంకానిపేట సబ్‌స్టేషన్ ఆవరణలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆ శాఖ ఏఈ జోగానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారని పేర్కొన్నారు. అధిక బిల్లులు, ఇతర సమస్యలను వేదిక దృష్టికి తీసుకొస్తే సత్వరమే పరిష్కారమవుతాయని స్పష్టం చేశారు. వినియోగదారులు వేదికను వినియోగించుకోవాలని కోరారు.

మునగ సాగు లాభసాటి

● ఔషధ గుణాలు, పోషక విలువలు

నెక్కొండ : మునగ సాగు లాభసాటి పంటగా గుర్తింపు పొందింది. ఔషధ గుణాలు, పోషక విలువలు కలిగిన మునగ కాయలు ఒకప్పుడు పెరటి తోటల్లో కనిపించేవి. ప్రస్తుతం రైతులకు సిరులు కురిపిస్తోందంటే అతిశయోక్తి లేదు. ఏడాది పొడవునా సాగవుతుండడంతో బహువార్షిక పంటగా చెప్పొచ్చు. పత్తి, మిర్చి సాగుతో నష్టాల బారిన పడిన రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారించారు. మునగ కాయలకు డిమాండ్ ఉండడమే ఇందుకు కారణం. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మునగ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఒక్కసారి నాటితే ఆర్నెళ్ల పాటు ఆదాయం

మునగ పంటను ఒకసారి నాటితే ఆర్నెళ్లపాటు ఆదాయం లభిస్తోంది. మండలంలోని అప్పల్‌రావుపేటకు చెందిన నల్లపు యతిన్ మునగ సాగు చేపట్టి లాభాలు అర్జిస్తున్నాడు. ఎకరం సాగు కోసం మొలకలతోపాటు ఎరువులు, తదితర ఖర్చులు కలిపి రూ.75 వేలు పెట్టుబడి పెట్టాడు. జనవరిలో నాటితే ఆర్నెళ్ల తర్వాత పంట కోతకు వచ్చింది. ఒకసారి నాటితే ఐదు దఫాలుగా ఆర్నెళ్లపాటు పంట చేతికొస్తోందని యతిన్ తెలిపాడు. రోజు విడిచి రోజు పంట కోసినప్పుడు సుమారు మూడు క్వింటాళ్ల వరకు ఉత్పత్తులు వచ్చాయి. ఒక్కో కిలో ధర రూ.30 పలుకడంతో రూ.9 వేలు ఆదాయం వచ్చినట్టు ఆయన చెప్పాడు. అలా నెలకు రూ.30 వేల చొప్పున ఆర్నెళ్లలో సుమారు రూ.2 లక్షలు ఆర్జించినట్టు తెలిపాడు. జూన్‌లో రెండో దఫా పంట పూర్తి అయ్యిందని, మరో మూడో దఫాల్లో పంట చేతికొస్తుందని వివరించారు. మునగ సాగులో అంతర పంటలుగా దోస, పొట్ల సాగు చేశాడు. ఒక సీజన్‌లో కేవలం మునగ సాగుతో సుమారు రూ.2 లక్షల రాబడి రాగా అంతర పంటలకు మరో రూ.50 వేల ఆదాయం పొందాడు. మునగకాయలు ఒక్కో చెట్టుకు 150–300 కాయలు కాస్తున్నాయని యతిన్ తెలిపాడు. పత్తి, మిరప సాగుతో నష్టం వస్తుండగా అధికారుల ప్రోత్సాహంతో మునగ సాగు చేశానని ఆయన చెప్పాడు.



అప్పల్‌రావుపేటలో మునగ తోట

రైతులను ప్రోత్సహిస్తున్నాం



మునగ సాగు చేసేలా సన్న, చిన్నకారు రైతులను ప్రోత్సహిస్తున్నాం. జిమునగ నాటిన మొదటి ఏడాది రైతుకు మెరుగైన దిగుబడి లభిస్తుంది. మునగ మొక్కలు, విత్తనాలు జూలై నుంచి ఆగస్టు నెలల్లో నాటితే జనవరిలో పూత దశకు చేరుకుంటుంది. మార్చి నుంచి జూన్ వరకు పంట చేతికొచ్చి లాభాలు అందిస్తుంది. మండలంలో సుమారు 25 ఎకరాల్లో మునగ సాగవుతోంది. ఎకరం సాగు చేస్తే పెట్టుబడి పోగా రూ.70 వేల నుంచి లక్ష వరకు ఆదాయం లభిస్తుంది.

– తరుణ్, ఉద్యానవన అధికారి

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న హరీశ్‌రెడ్డి

● నెక్కొండ మార్కెట్ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం మండలంలోని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గురువారం ఆయన మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం లబ్ధిదారు చెవ్వ కిష్టమ్మ ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో పేదలెవరికీ అన్యాయం జరగదని స్పష్టం చేశారు. అర్హులకు విడతల వారీగా సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ఇళ్ల నిర్మాణ దశ మేరకు బిల్లులు అందుతాయని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, కోశాధికారి కేవీ. సుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సదానందం, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రామారపు శిరీష, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల ఉన్నతికి బాటలు

● కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

నర్సంపేట : ఎన్‌ఎస్‌ఎస్‌తో విద్యార్థుల ఉన్నతికి బాటలు పడతాయని ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ తెలిపారు. పట్టణంలోని బాలాజీ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ఆయన హాజరై మాట్లాడారు. లక్ష్య సాధనకు ఎన్‌ఎస్‌ఎస్ అద్భుతమైన వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. దేశాభివృద్ధికి అటంకాలైన మూఢనమ్మకాలు, నిరక్షరాస్యత, డ్రగ్స్ వంటి వాటిని సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోర్తాల రామరాజు మాట్లాడుతూ కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ రిజిస్ట్రేషన్ చేయించుకుని కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, అధ్యాపకులు రవీందర్, భిక్షపతి, రాజ్‌కుమార్, మధు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



ఎన్నిక పత్రం అందిస్తున్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్

నర్సంపేట : చెన్నారావుపేట మండలం కాల్‌నాయక్‌తండా, జోజిపేట నారాయణతండా గ్రామాలకు కాంగ్రెస్ స్థానిక కమిటీలను పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ గురువారం ప్రకటించారు. కాల్‌నాయక్‌తండా కమిటీకి అధ్యక్షుడిగా ఆంగోతు గోవిందు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లావుడ్య స్వామి, ఉపాధ్యక్షుడుగా లావుడ్య భద్రు, ప్రధాన కార్యదర్శిగా గుగులోతు శ్రీను, కార్యదర్శిగా భానోతు వీరూ, కోశాధికారిగా లావుడ్య నర్సింహ, యూత్ ప్రెసిడెంట్‌గా బాదావత్ నాగరాజు, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుగులోతు తరుణ్, యూత్ ఉపాధ్యక్షుడిగా భూక్య రాజ్‌కుమార్, యూత్ ప్రధాన కార్యదర్శిగా లావుడ్య గణేశ్ ఎన్నికయ్యారు. జోజిపేట నారాయణతండా గ్రామ కమిటీకి అధ్యక్షుడిగా దాసరి దిలీప్, గౌరవ అధ్యక్షుడిగా నాగోతు ఆరోగ్యస్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లావుడ్య చందు, ఉపాధ్యక్షులుగా భానోతు రమేశ్, లావుడ్య హరిలాల్, ప్రధాన కార్యదర్శిగా భానోతు రవి, కార్యదర్శిగా భానోతు శివ, సహాయ కార్యదర్శిగా అల్వాల రాజు, కోశాధికారిగా గుగులోతు రమేశ్, యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగోతు హరీశ్, ఉపాధ్యక్షుడిగా భానోతు గణేశ్, గ్రామ మహిళా కమిటీ అధ్యక్షురాలిగా గుగులోతు వీరమ్మ ఎన్నికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మాజీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేశ్, మండల ప్రధాన కార్యదర్శి రాములు, మండల ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



నర్సంపేట : చెన్నారావుపేట తహసీల్దార్ మహ్మద్ ఆబిద్ అలీని, ఎంఈఓ బైరి సరళను, ఎస్సై రాజేశ్‌రెడ్డిని నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా, మండల కమిటీ బాధ్యులు గురువారం వేర్వేరుగా సన్మానించారు. తొలుత వారిని సంబంధిత కార్యాలయాల్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి సంగెం రమేశ్ మాట్లాడారు. ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మంద నరేశ్, ఉపాధ్యక్షురాలు అలువాల కల్యాణి, ప్రధాన కార్యదర్శి నూనె తిలక్, మండల అధికార ప్రతినిధి భూక్య రాజునాయక్, నాయకులు శివ, కేతిడి దేవేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో భూసారం పెంపు

నర్సంపేట రూరల్ : నానో యూరియా వినియోగిస్తే భూసారం పెరుగుతుందని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు దామోదర్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని మగ్దుంపురంలో ఇఫ్కో కంపెనీ ప్రతినిధులు గురువారం నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో డ్రోన్ వినియోగించి నానో యూరియా స్ప్రే చేశారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. డ్రోన్‌తో తక్కువ శ్రమతో స్ప్రే చేయవచ్చని చెప్పారు. వాటర్ ఫ్లూషన్ కాకుండా నానో యూరియా స్ప్రే చేయడం వల్ల కలిగే లాభాలను తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ కృష్ణకుమార్, ఏఈఓ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కావాలంటే 'లిక్విడ్' కొనాల్సిందే



వర్ధన్నపేట: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో యూరియా బస్తా కావాలంటే నానో యూరియా లిక్విడ్ బాటిల్ కొనాల్సిందేనని వ్యాపారులు ఒత్తిడి చేస్తున్నట్టు రైతులు వాపోయారు. అవసరం లేకున్నా యూరియా బస్తాతోపాటు నానో యూరియా లిక్విడ్ బాటిల్‌ను అంటగడుతూ రైతులను నిలువునా దోచుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బస్తా యూరియా కొనేందుకు రాగా లిక్విడ్ బాటల్ అంటగట్టి రూ.520 చొప్పున వసూలు చేసినట్టు రైతులు తెలిపారు.

గొర్రెను కాపాడబోయి రైతు మృతి



స్వామి (ఫైల్)

నెక్కొండ : గొర్రెను కాపాడబోయి ప్రమాదవశాత్తు రైతు మృతి చెందిన ఘటన మండలంలోని బొల్లికొండలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావత్ స్వామి (35) వ్యవసాయం చేయడంతోపాటు గొర్రెలను సాకుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం ఉదయం గొర్రెల మందను తీసుకుని భార్య జ్యోతితో కలిసి స్వామి వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా ఓ గొర్రె ఎస్సారెస్పీ కాల్వలో పడింది. దాన్ని కాపాడేందుకు కాల్వలో దూకిన స్వామి నీటి ఉధృతికి ఊపిరాడక మృతి చెందాడు.

పారిశుద్ధ్య పనుల్లో శ్రద్ధ పెట్టండి

● జిల్లా పంచాయతీ అధికారి కల్పన



రికార్డులు తనిఖీ చేస్తున్న డీపీఓ కల్పన

దుగ్గొండి : వర్షాకాలం నేపథ్యంలో పారిశుద్ధ్య పనులపై పంచాయతీ కార్యదర్శులు శ్రద్ధ పెట్టాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) కల్పన ఆదేశించారు. మండలంలోని గిర్నిబావి గ్రామ పంచాయతీ కార్యదర్శిని ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం అధికారులను, సిబ్బందిని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. గ్రామాల్లోని ప్రధాన వీధులను ప్రతిరోజూ శుభ్రం చేయించాలని చెప్పారు. నీరు నిలిచిన చోట దోమలు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, తాగు నీటిని క్లోరినేషన్ చేయించాలని కోరారు. పంచాయతీ కార్యదర్శులు విధుల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట మండల పంచాయతీ అధికారి మోడెం శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి నూనె వేణుప్రసాద్, తదితరులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



అవగాహన కల్పిస్తున్న డీఈ ఆనందం

● డీఈ ఆనందం, ఏడీఈ నటరాజ్

రాయపర్తి : వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లలోని, ఇతర విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు డీఈటీ ఇన్‌చార్జ్ డీఈ ఆనందం, వర్ధన్నపేట ఏడీఈ నటరాజ్ తెలిపారు. మండలంలోని మైలారం సెక్షన్ పరిధిలోని వెంకటేశ్వరపల్లిలో గురువారం నిర్వహించిన పొలంబాట కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. రైతులకు విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులు, సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. సొంతంగా పనులు చేపడితే ప్రమాదాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పలు చోట్ల విద్యుత్ సమస్యలను పరిష్కరించేలా పనులు చేపట్టారు. కార్యక్రమంలో ఏఎల్‌ఎంలు దయాకర్, పురుషోత్తం, రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్యతతోనే గ్రామాల అభివృద్ధి

● ఎంపీడీఓ లెక్కల అరుంధతి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

దుగ్గొండి : రాజకీయాలకు అతీతంగా ఐక్యత ముందుకు సాగితే గ్రామ అభివృద్ధికి అడుగులు పడతాయని ఎంపీడీఓ లెక్కల అరుంధతి తెలిపారు. మండలంలోని నాచినపల్లిలో గ్రామాభివృద్ధిపై వివిధ పార్టీల నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలని సూచించారు. తొలుత వివిధ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం గ్రామంలో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటుపై ప్రజాభిప్రాయం కోరగా జనావాసాల్లో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేస్తే ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందన్న అభిప్రాయం వెల్లడైంది. తెలిపారు. ఈ మేరకు తీర్మానం చేశారు. తదనంతరం తమ కాలనీలో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయొద్దని కోరుతూ ఇందిర నగర్ కాలనీవాసులు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇజ్జగిరి, ఎంపీఓ శ్రీధర్ గౌడ్, ఏఈ రంజిత్, పంచాయతీ కార్యదర్శి కల్యాణి, నాయకులు నాగరబోయిన మోహన్, శ్రీరామోజు ప్రభాకర్, నాతి వెంకటేశ్వర్లు, నల్ల రాంరెడ్డి, జంగ రాజిరెడ్డి, నర్సయ్య, ధర్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వీడకుంటే ఆందోళనలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న అనిమిరెడ్డి

● మాజీ ఎంపీపీ అనిమిరెడ్డి

రాయపర్తి : యూరియా పంపిణీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వీడకుంటే బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరిపడా యూరియా అందక మండలంలోని అన్ని గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. బీఆర్‌ఎస్ పాలనలో రైతులకు సరిపడా యూరియా అందించేందుకు నిల్వ ఉండేదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యుత్, నీటి సరఫరా కావడం లేదన్నారు. యూరియు కూడా సకాలంలో అందడం లేదని చెప్పారు. సమావేశంలో కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోశ్ గౌడ్, నాయకులు గుగులోతు జాజునాయక్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, పరుపాటి రవీందర్‌రెడ్డి, చిట్యాల వెంకన్న, బొద్దు రంగయ్య, ముద్రబోయిన సుధాకర్, రాము, చిన్నాల ఉప్పలయ్య, చిన్నాల రాంబాబు, ఐత కుమార్, పోగులకొండ వేణు, సంకినేని ఎల్లస్వామి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

అంగడి రోడ్డుకు నిధులివ్వం

గీసుకొండ : మండలంలోని కొమ్మాల అంగడి రోడ్డు నిర్మాణానికి గ్రామ పంచాయతీ నిధులు ఇవ్వబోమని గ్రామస్తులు తీర్మానించారు. కొన్ని రోజుల క్రితం కొమ్మాల అంగడి పరిధిలోని ఐదు గ్రామపంచాయతీల వారు రూ.52 లక్షల నిధులతో కొమ్మాల బస్‌స్టాండ్ నుంచి అంగడి వరకు సీసీ రోడ్డును నిర్మించాలని అనధికారికంగా కాంగ్రెస్ నాయకులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం గ్రామసభ నిర్వహించారు. సంబంధిత గ్రామపంచాయతీల తీర్మానాలు లేకుండా, ప్రభుత్వం నుంచి రోడ్డు నిర్మాణం కోసం మంజూరి ఉత్తర్వులు లేకుండా ఎమ్మెల్యే ఎలా శంకుస్థాపన చేస్తారని పలువురు గ్రామసభలో ప్రశ్నించారు. కొమ్మాల గ్రామం వాటాగా రూ.20 లక్షల నిధులు అంగడి రోడ్డు నిర్మాణానికి కేటాయించాలని దీని కోసం సరే అనే వారు, లేదంటే వ్యతిరేకించే వారు గ్రామసభలో చేతులెత్తాని ఎంపీడీఓ శ్రీనివాస్ ప్రతిపాదించారు. దీంతో గ్రామసభలో మెజారిటీ గ్రామస్తులు అంగడి రోడ్డుకు జీపీ నిధులను ఇవ్వబోమంటూ చేతులెత్తి తీర్మానించారు. గ్రామసభను ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాక శ్రీనివాస్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రావులు నిర్వహించగా సభ వాడివేడిగా సాగింది. ఎన్నడు లేని విధంగా గ్రామసభ నిర్వహణకు భారీగా పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేశారు. గీసుకొండ సీఐ మహేందర్, ఎస్సైలు కుమార్, అనిల్‌కుమార్, ఏఆర్ పోలీసులు సుమారు 20 మంది గొడవలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

● ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం రంగారావు

నెక్కొండ : క్రీడలతో శారీరక, మానసిక వికాసానికి బాటలు పడతాయని స్థానిక ప్రభుత్వ హైస్కూల్ హెచ్‌ఎం రంగారావు తెలిపారు. మండల కేంద్రానికి చెందిన విశ్రాంత విద్యుత్ శాఖ ఏఈ, ప్రియదర్శిని యువజన సంఘం కన్వీనర్ చల్లా రఘోత్తమ్‌రెడ్డి సొంత డబ్బుతో సమకూర్చిన స్పోర్ట్స్ యూనిఫామ్‌ను విద్యార్థులకు స్కూల్ ఆవరణలో గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. పూర్వవిద్యార్థి రఘోత్తమ్‌రెడ్డి విద్యార్థులకు తోడ్పాటు అందించడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చల్లా కిషన్ రెడ్డి, కృష్ణారావు, యాకయ్య, భాస్కర్, రాపాక ఐలయ్య, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో జట్టుకు చెందిన 12 మంది విద్యార్థులకు బయాలజీ ఉపాధ్యాయుడు శశిధర్ రూ.6 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేశారు. ఆయన్ను హెచ్‌ఎం తేజావత్ జయ అభినందించారు. కార్యక్రమంలో పీఈటీ వీరగోని స్వప్న, ఉపాధ్యాయులు సునీత, పిన్నింటి బాలాజీరావు, ఉదయ్‌కుమార్, మాధవి, సుందర్, సతీశ్‌కుమార్, హంస రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



మాట్లాడుతున్న రమాదేవి

రాయపర్తి : బాలల హక్కులపై విద్యార్థులకు అవగాహన ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ రమాదేవి తెలిపారు. మండలంలోని మైలారం ప్రభుత్వ హైస్కూల్‌లో పది రోజులుగా నిర్వహిస్తున్న ప్రత్యేక అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలల హక్కులు, బాల్యవివాహ నిషేధ చట్టం, బేటీ బచావో, బేటీ పడావో పథకం, డబ్ల్యూసీడీ, ఎస్‌సీ సేవలు, 1098, 100, 181, 1930, 14567, 155326 హెల్ప్‌లైన్ నంబర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉమాదేవి, ఉపాధ్యాయులు అనిత, ప్రమోదిని, జి.మమత, జె.మమత, రవీందర్, యోగశ్రీ, అంగన్‌వాడీ టీచర్లు యమున, ప్రవళిక, ఆశా కార్యకర్త లత తదితరులు పాల్గొన్నారు.